**కథ**

# అంజయ్య పెళ్లి

**వాణిశ్రీ**

**'అంజయ్య గుళ్లో పెళ్లి చేసుకున్నాడంట' అనే వార్త తాటాకు మంటలా, టీవీల్లో ఫ్లాష్ న్యూస్‌లా ఆఫీసు నలుమూలలా వ్యాపించింది.**

ఆఫీసులో ఏ ఇద్దరు కలుసుకున్నా అంజయ్య పెళ్లి గురించే మాట్లాడుకుంటున్నారు. కడుపుబ్బ నవ్వుకుంటున్నారు.

'ఇటువంటి విచిత్రం నేను జన్మలో వినలేదు'

'ఐనా ఇదేం పోయేకాలం.'

'అది వాడికి ఏ మందో మాకో పెట్టి ఉంటుంది'

ఇలా తలోక రకంగా కామెంట్స్ చేస్తూ కాలక్షేపం చేశారు.

ఒక ఆడ, మగ పెళ్లి చేసుకోవడం విచిత్రం ఏం కాదుగానీ అంజయ్య ఇప్పుడు పెళ్లి చేసుకోవడమే వింత. ఎందుకంటే అంజయ్య కూర్చుంటే లేవలేడు, లేస్తే కూర్చోలేడు. కళ్లు కూడా సరిగా కనిపించడంలేదు. కేటరాక్ట్ ముదిరి ఆపరేషన్ చేయించుకోవాలని వాయిదా లేస్తున్నాడు. వినికిడి కూడా అంతంతమాత్రమే. ఇంతకీ అంజయ్యకి ఎన్నేళ్లుంటాయంటే నిజంగా ఎవరికీ తెలియదు. దగ్గర దగ్గర డెబ్బై ఉంటాయి. ఆఫీసు రికార్డుల్లో మాత్రం అతనికి ఏభై ఐదేళ్లే. ఇంకా ఐదేళ్లు పనిచేస్తేగానీ రిటైర్ అవ్వడు. అంజయ్య ఆ రోజుల్లో ప్యూన్‌గా చేరినప్పుడు విద్యార్హతల పట్టింపు లేదు. డాక్టర్ సర్టిఫికెట్ ఇస్తే దాని ఆధారంగా సర్వీస్ రోల్ తెరిచేవారు. అలా ముప్పై ఏళ్లు దాటాక ఇరవై ఏళ్లని డాక్టర్ సర్టిఫికెట్ తెచ్చుకుని చేరి ఉంటాడు.

మర్నాడు అంజయ్య పెళ్లి గురించి తోటి అటెండర్లు మరికొంత సమాచారం సేకరించారు. గుళ్లో పెళ్లి చేసుకున్న అంజయ్యకి పెళ్లికూతురు కూతురులాగానో, మనుమరాలిలాగానో ఉందని చెప్పుకున్నారు. పైగా ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు కూడానట. అంజయ్యకి అదృష్టం కలిసొచ్చి నడిసొచ్చే కూతుళ్లొచ్చారని జోక్ చేశారు.

ఆఫీసులో అంజయ్య పెళ్లి సృష్టించిన హల్‌చల్ గమనిస్తూ సిబ్బంది గుమాస్తా శంకరయ్య తనలో తను నవ్వుకున్నాడు. ఎందుకంటే అంజయ్య పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించుకుని శంకరయ్య సలహా అడిగాడు. అందుకని ఏదో ఒకరోజు అంజయ్య పెళ్లి చేసుకుంటాడని శంకరయ్య ఊహించాడు.

★ ★ ★

వారం రోజులు సెలవుపెట్టిన అంజయ్య తిరిగి వచ్చాడు. కొత్తపెళ్లికొడుకని అంతా అంజయ్యని ఆటపట్టించారు తోటి అటెండర్లు. 'పార్టీ ఏదయ్యా అంజయ్యా!' అని కొందరు జోకులు వేశారు. 'హనీమూన్‌కి ఎక్కడకెళ్తున్నావ్?' అని హాస్యమాడారు. అంజయ్య నవ్వుతూ వాళ్ల జోకులు ఎంజాయ్ చేశాడు.

శంకరయ్య దగ్గరికి వచ్చి మ్యారేజి సర్టిఫికెట్ ఇచ్చాడు. సత్తెమ్మ అనే ఆమెను పెళ్లి చేసుకున్నాననీ, ఆమె తన వారసురాలనీ డిక్లరేషన్ ఇచ్చాడు.

అన్నంత పని చేసిన అంజయ్య వైపు ఆశ్చర్యంగా చూశాడు శంకరయ్య. అతను తనకంటే ఎంతో చిన్నదైన సత్తెమ్మను పెళ్లి చేసుకోవడానికి ఏదో బలమైన కారణమే ఉండి ఉంటుందని అనుకున్నాడు. ప్రతీ మనిషికీ ఒక కథ ఉంటుంది. ఒకరి కథకు మరొకరి కథకూ పోలికలే ఉండవు. ఎంత విచిత్రమో? అనుకున్నాడు శంకరయ్య.

ఆర్నెల్లు గడిచిన తర్వాత అంజయ్య మంచాన పడ్డాడు. మెడికల్ లీవు పెట్టాడు. ఒకసారి ఇంటికి వచ్చిపొమ్మని శంకరయ్యకు కబురు చేశాడు అంజయ్య. ఎలా ఉన్నాడో పాపం మంచి మనిషి. చూసి వద్దాం అనుకుంటూ ఉండగానే అంజయ్యను హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేశారని తెలిసింది. ఇంటికి వెళ్లి చూద్దాం అనుకుంటూ ఉండగా తనే కబురు చేశాడు అంజయ్య.

అంజయ్య ఇల్లు తెలిసిన అటెండర్ని వెంటబెట్టుకుని వెళ్లాడు శంకరయ్య.

''సార్! నమస్తే..'' అంటూ మంచంలో పడుకుని ఉన్న అంజయ్య లేవబోయాడు.

''లేవకు పడుకో'' అని వారించాడు శంకరయ్య.

అంజయ్య చిక్కిపోయాడు. ముఖంలో కళ లేదు. కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని తెలిసింది. ఇక ఎక్కువ రోజులు బతకడని అనిపించింది శంకరయ్యకు.

సత్తెమ్మ కాఫీ తెచ్చి ఇచ్చింది.

''నా భార్య సార్'' అని పేలవంగా నవ్వాడు అంజయ్య.

సత్తెమ్మ నమస్కారం చేసింది.

''నేను పోయాక ఈ సారే నీకు ఉద్యోగం ఇప్పిస్తాడు. నువ్వు ఈ సార్ దగ్గరికే వెళ్లు. అది చేస్తాం, ఇది చేస్తాం అని యూనియన్ నాయకులు నీ చుట్టూ తిరుగుతారు. ఎవర్నీ నమ్మకు.''

అంజయ్య మాటలకు అడ్డొస్తూ ''ఇప్పుడెందుకు అటువంటి మాటలు'' అన్నది సత్తెమ్మ.

''ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చెప్తాను?'' అన్నాడు అంజయ్య.

''ఏం కాదులే అంజయ్యా! రెగ్యులర్‌గా మందులు వేసుకో. తగ్గిపోతుంది. నువ్వు మళ్లీ ఆఫీసుకు రావాలి'' అని ధైర్యం చెప్పాడు శంకరయ్య.

అంజయ్య నవ్వి ''మిమ్మల్ని ఎందుకు రమ్మన్నానో తెలుసా? ముసలి వయసులో ఈ పిల్లను ఎందుకు పెళ్లి చేసుకున్నానో మీకు తెలియాలి. నాకోసం కాదు సార్.. ఆ పిల్ల కోసం చేసుకున్నాను. తనే అంతా చెప్తుంది వినండి'' అన్నాడు.

సత్తెమ్మ తల వంచుకుని నిల్చుంది. ఆమె పెద్ద అందగత్తె ఏం కాదు. సన్నగా ఉంది. నలుపుగా ఉంది. ముప్పై పైన ఎన్నేళ్లయినా ఉండొచ్చు.

''సార్‌కి అంతా చెప్పు'' అన్నాడు అంజయ్య.

''కూర్చో అమ్మాయి'' అన్నాడు శంకరయ్య.

సత్తెమ్మ ఒక స్టూలు మీద కూర్చుంది.

''అందరూ ఉండి ఎవరూ లేనిదాన్ని సార్'' అని ఏడ్చింది సత్తెమ్మ.

''ఇప్పుడు నీకు అంజయ్య ఉన్నాడుగా తోడు. ఏడవకు, ఇక నువ్వు దిగులుపడాల్సిన పనిలేదు'' అని ధైర్యం చెప్పాడు శంకరయ్య.

''అంజి నా పాలిట దేవుడు సార్'' అన్నది సత్తెమ్మ.


శంకరయ్య ఆమె వైపు విచిత్రంగా చూశాడు. అది గమనించి సత్తెమ్మ కళ్లు తుడుచుకుని నవ్వింది.

''నేను ఐదారేళ్లుగా అలాగే పిలుస్తున్నా సార్'' అన్నది.

''ఓహో... మీది లవ్ మేరేజి అన్నమాట'' అని నవ్వాడు శంకరయ్య.

అంజయ్య ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు.

''సార్.. నాకు పదిహేనేళ్ల క్రితం పెళ్లయింది. ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన తర్వాత నా భర్త వదిలేసి వెళ్లిపోయాడు. నా అత్తింటివాళ్లు నన్ను పుట్టింటికి తరిమేశారు. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నం పాతికవేలు ఇవ్వమని మా అన్నయ్య వాళ్లతో పోట్లాడాడు. పెద్దమనుషుల్ని పంపించాడు. మొత్తానికి వాళ్లు దిగి వచ్చి పాతిక వేలు ఇచ్చారు. ఆ డబ్బు మా అన్నయ్య తీసుకుని ఎవరికో వడ్డీకి ఇచ్చాడు.




ఏం జరిగిందో ఆ డబ్బు ఎగ్గొట్టారని అన్నాడు అన్నయ్య. అప్పు చేసి గేదెల్ని తెచ్చాడు. నేనే వాటి పని చూసేదాన్ని. ఇంటింటికి తిరిగి పాలు పోసేదాన్ని. ఐనా ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. అన్నయ్య తాగుడికి అలవాటుపడి ఇంటిని నరకం చేశాడు. రెండు పూటలా అన్నం ఉండని పరిస్థితి ఉండేది. నేను, నా కూతుళ్లు పస్తులు ఉండాల్సొచ్చింది. అంజయ్యకు నేనే రోజూ పాలు పోసేదాన్ని. అతనే వంట చేసుకుంటూ ఉండేవాడు. భార్య చనిపోవడం ఈ వయసులో ఒక శాపం లాంటిదని వాపోతుండేవాడు. నేను అతన్ని అంజి అని పిలుస్తూ ఆట పట్టించేదాన్ని. ఒకసారి అంజయ్యకు జ్వరం వచ్చి మంచంలో నుంచి లేవలేదు. నేను అతని పరిస్థితి చూసి హాస్పిటల్‌కి తీసుకెళ్లి మందులు ఇప్పించాను. వంట చేసి పెట్టాను. రోజూ వంట చేసి పెట్టు. నువ్వు, నీ కూతుళ్లు ఇక్కడే తినండి అన్నాడు అంజయ్య. రెండు పూటలా కడుపునిండా తిండి దొరకడం కన్నా కావాల్సింది ఏముందని నేను సరే అన్నాను.

అంజయ్యకు వండి పెడుతూ ఉన్నాను. ఇదంతా మా వదినకు కడుపు మంటగా ఉంది. ఆమెకు తిండి లేకపోవడం, పిల్లలూ తనూ పస్తులుండడం, నేనూ నా కూతుళ్లు సుష్టుగా తింటూ హాయిగా ఉండటం చూసి అసూయ పడింది. ఒకరోజు నామీద విరుచుకుపడింది. తండ్రి వయసున్నవాడితో సంబంధం పెట్టుకుంటావా అని తిట్టిపోసింది. మా అన్న కూడా తాగిన మైకంలో నన్ను కొట్టాడు. నాకు దిక్కుతోచక జరిగినదంతా అంజయ్యతో చెప్పి ఏడ్చాను. అంతా నీ మంచికే అని నవ్వాడు. అప్పట్నుంచి ఇక ఇంటికి వెళ్లకుండా అంజయ్య దగ్గరే ఉంటున్నాను. అంతా నన్ను అంజయ్య ఉంచుకున్నాడని ముద్ర వేశారు. అందరూ అనుకునేదాన్ని నిజం చేద్దామని అంజయ్య అన్నాడు. నేను సరేనని అన్నాను.''

సత్తెమ్మ ఏడుస్తూ ఉంది.

శంకరయ్య ఆమె తల మీద చెయ్యి వేసి ఆప్యాయంగా నిమిరాడు.

''ఎందుకమ్మా ఏడుస్తావు? ఏడవాల్సిన అవసరం ఇప్పుడేమీ లేదు. అంజయ్య తను పోయిన తర్వాత కూడా నువ్వు సుఖంగా ఉండే ఏర్పాటు చేశాడు. అందుకే పెళ్లి చేసుకుని, నిన్ను వారసురాలిని చేసుకున్నాడు. దిగులు పడకు'' అన్నాడు.

ముసలి వయసులో పెళ్లి చేసుకుని పిచ్చి పని చేశాడని లోకం అనుకోవచ్చు. కానీ అనాథ అయిన ఆడదానికి జీవితాంతం భద్రత కల్పించడం కోసం, ఎవరూ చేయలేని సాహసం చేశాడని ఎవరికీ తెలీదు అనుకున్నాడు శంకరయ్య.

''వెళ్లొస్తా అంజయ్యా! వస్తా సత్తెమ్మా!'' అని బయల్దేరాడు శంకరయ్య.

''సార్! మిమ్మల్ని మళ్లీ చూస్తానో లేదో?'' చేతులెత్తి నమస్కారం చేస్తూ అన్నాడు అంజయ్య.

శంకరయ్య గుండె బాధతో మూలిగింది. కళ్లల్లో నీటి పొర కదిలింది.